
# అంకితం

రచన.
శ్రీ. అలమూరు సూర్య వెంకటరమణారావు

[కనడంవంతు అమ్మదే అయినా, పెంచడంవంతు తనదే చేసుకుని భవిష్యత్తులో నా బాగుకోసం భగవంతుడన్నవాడికల్లా మొక్కి, తీరా అదిచూసి ఆనందించే సమయానికి ఏ పూర్వజన్మపాపంవల్లనో మనిషిగా మాకు దూరమయిన, మా పెద్దత్తయ్యకు అనంతంలో ఉండయినా నన్ను ఆశీర్వదించమనే ఆమె అమృతహృదయానికి ఆనందాశ్రువులతో]



ఆరోజు ఫైల్సు అన్నీ చూడటం ముగించి బయట పడదామనుకుంటున్నంతలో "అయ్యగారు రమ్మంటున్నారు" అన్నవార్త చెవిలోవేసి పోయాడు హౌసుప్యూను రంగయ్య! ఆశ్చర్యపోయాను! అవును మరి రోజూ వెళ్లే ముందర ఆయనతో కాస్సేపు మాట్లాడే వెళ్తూంటాను. ఈ రోజు కబురంపించారూ అంటే ఏదో విశేషమయిన పని ఉంటుందన్నమాటే! వాస్తవానికి ఆయన దగ్గిర పర్సనల్ సెక్రటరీగా ఉంటున్నానన్న మాటే కాని ఆ భావమే వారిలో లేదు! వాళ్ళింట్లో ఒక మనిషిలాగే వారి మనసుల్లో ఆత్మీయుడిలాగే ఆదరిస్తున్నారు. అటు ఆంధ్ర ఇటు మద్రాసు రాష్ట్రాలలో పేరు గడించిన మైకాప్రొప్రయిటర్సు వెంకటాచలంగారు ఎంత ధనవంతులో అంత సహృదయులు! వారికింత మంచిమనసు లేకపోతే మంచి వయసులో ఒక పసికందుని అయన జీవితానికి బాధ్యతగా విడిచి భార్యగతించిన తర్వాత అవిడమీద మమకారం కొద్దీ, ఆ పసికందు భవిష్యత్ మీద అభిమానం కొద్దీ, ఎంతమంది ఎన్ని విధాలు చెప్పినా మరో వివాహం చేసుకోకుండా ఆయన సుఖాన్ని త్యాగం చెయ్యగలిగారు! తల్లీ, తండ్రీ తనే అయి ప్రపంచం తెలియని ఆ పసికందుని పద్దెనిమిదేళ్ళు పెంచటానికి ఎంత అవస్థపడ్డారో అంత అనుభవమూ గడించారు! ఎంత అనుభవం సంపాదించుకోకపోతే బాధ్యత పట్టించుకోకుండా తిరిగే వయసులో తండ్రి గతిస్తూ వ్యాపారాన్ని - భార్య గతిస్తూ కూతుర్ని - అప్పగించివెళ్ళిపోతే, అటువ్యాపారాన్ని, ఇటు కూతుర్ని పెంచుకు రాగలిగారు? పద్దెనిమిదేళ్ళయినా నిండని ఆయన కూతురు సావిత్రి అందానికి "వాళ్ళమ్మపోలికే" అంటుంటారు అవిడని ఎరుగున్నవాళ్లు అప్పుడప్పుడు వెంకటాచలంగారూనూ! సహృదయా

నికి, కలుపుగోలుతనానికి, అవసరంవరకే మాట్లాడ్డంలోనూ తండ్రికి తగిన కూతురే! వయస్సు పైబడబోతున్నా, మేడదిగి క్రిందికి రాలేని ఆయాసంతో బాధపడుతున్నా, ఆయన వ్యాపారం మానలేదు! అయిన వాళ్లు, అతి సన్నిహితులూ వెంకటాచలంగారూ! ఆ వ్యాపారం మానెయ్యకూడదండీ, అని మాట వరసకంటే మనం వ్యాపారం మానుకుంటే దానిమీద ఆధారపడి బ్రతికేవాళ్ళ అవస్థేం అవాలయ్యా అంటారు. ఆయన దగ్గిర పర్సనల్ సెక్రటరీగా చేరిన ఈ అయిదేళ్లలోనూ నన్నెంత ఆత్మీయుడిగా చేసారని! ప్రపంచంలో ఒక్కొక్కరి తత్వమే అంత!

ఆ బంగళాలోనే క్రిందని ఒక వైపుగా ఉన్న ఆఫీసులులోంచి బయటపడి మేడ మీదకు వెళ్ళాను. ఆయన కూతురుతో మాట్లాడుతూ కూర్చున్నారు. నన్ను చూడగానే ''రావోయి రా ఆఫీసుపని తెమిలిందా' అన్నారు. కూర్చోమని ఎదురుగా సోఫా చూపిస్తూ. 'తెమిలిందా అనుకుంటూంటే ఎప్పటికీ తెమలపు ఏవీనూ! అవసరం అవకాశం చూసి మనమే తెముల్చుకుంటూండాలి' అన్నాను కూర్చుంటూ. 'అంతే, అంతే చిన్నవాడివయినా పెద్దమాటన్నావు' అని రంగయ్యని పిలిచి కాఫీలు తీసుకు రమ్మన్నారు. 'రేపు సోమవారం అమ్మాయి పుట్టిన రోజు' అన్నారు నా వైపుచూసి! గుడ్‌లక్ అన్నాను. 'అది ఏవో బట్టలు తీసుకుంటానంటున్నాది. మేడ దిగితేనే నాకు ఆయాసం. ఇంక షాపింగ్‌కు వెళ్ళటం అంటే ఓ యజ్ఞం చేసినట్లే. అందుకని నిన్నొకసారి వెళ్ళిరమ్మందామని పిలిపించాను' అంటూ రంగయ్య తెచ్చిన కాఫీ కప్పు తీసుకున్నారు. అప్రయత్నంగా నేను సావిత్రివైపు చూసాను. ఆమె మరొక కప్పు నాకందిస్తూ ఏం? ''మీకేమయినా పని ఉందా'' అంది. ఇంక అప్పుడు ఏమన్నా చెల్లదు. చెల్లనియ్యరు! 'ఉన్న పనేదో పూర్తి చేసుకునేగా వచ్చాను' అన్నాను కాఫీ తీసుకుంటూ. కాఫీ పూర్తయాక లేచి 'పదండి మరి' అన్నాను. ఆమె లేచి రంగయ్యా డ్రయివర్ని కారు తీసుకొని పోర్టికోలోకి రమ్మను అని చెప్పి


Regd. Trade Mark.

DOVETEX
TRADE MARK

No. 162919

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!

ఫోన్ : 2217 :: తంతి : " డొటెక్స్ "

డొటెక్స్ కంపెని

(ఉత్పత్తిదారులు, రవాణాదార్లు)

బెడ్ షీట్స్ - టవల్స్, మొదలైనవి.

చేనేత బట్టలు మరియు నూలు వ్యాపారస్తులు.

నెం. 14, మహల్ 2వ వీధి, మధురై (S.I)

Leading Printers of Quality....

*Contact for your Requirements of :—*

**Readymade Photo Offset Calendars, in Verious, Cine-Religious, Scenery and Baby Designs.**

**CHIDAMBARAM LITHO PRESS**

[Tel ; "VEESEE" — Post Box No. 43. — Phone No : 49]

**SIVAKASI (S. I.)**

'వెళ్ళొస్తాను' అని తండ్రితో చెప్పి మెట్లు దిగి వెళ్ళిపోయింది. వెంకటాచలంగారితో 'వెళ్ళొస్తానండీ' అన్నాను. ఆయన కోట్లోంచి అయిదు వంద రూపాయల కాగితాలు ఇచ్చి సరిపోకపోతె ఎకౌంటులో వెయ్యమను అన్నారు. అలాగే అని క్రిందకు దిగి పోర్చికో లోనికి వచ్చాను. కారులో కూర్చుని ఎదురు చూస్తున్నాది సావిత్రి. ఫ్రంట్‌డోరు తీసి లోపల కూర్చుని డ్రయివర్‌తో 'పోనియ్' అన్నాను. వెనకసీట్లో కూర్చున్న సావిత్రి 'ఆపు' అని క్రిందకు దిగి 'డ్రయివర్ ఇవాల్టికి నువ్వింటికి వెళ్ళు' అంది. 'సరి అమ్మా' అని వాడు దిగి వెళ్ళిపోయాడు. ఆమె స్టీరింగ్ దగ్గిర కూర్చుని స్టార్టు చెయ్యబోయింది. అదేవిటి మీరు డ్రయివ్ చేస్తారా భలేవారే అని దిగి అటువైపు వెళ్ళి 'జరగండి' అన్నాను. మరేం అనకుండా జరిగి కూర్చుంది. స్టీరింగ్ ముందు కూర్చుని స్టార్ట్ చేసాను. ఇద్దరి మధ్య నిశ్శబ్దం! 'ఎందుకింత దూరంగా ఉండాలనుకుంటున్నారు.' అడిగిందామె! 'ఇందులో దూరం ఏముందీ' అన్నాను. 'కాకపోతే ఎవరోపరాయి వాళ్ళల్లాడ్రయివర్ పక్కన కూర్చోటంలో ఉద్దేశం?' అందామె. 'అంత మాత్రానికే అంతహంగామా చెయ్యాలా మీరు' అన్నాను నవ్వుతూ! 'చూడండీ నాతో మాట్లాడాలని లేదా' అంది కాస్త సీరియస్‌గానే! 'ఇప్పుడు చేస్తున్నది ఏవిటంటారు?' అన్నాను. అదిగో ఆ అండీలు గౌరవాలుతో మాట్లాడితే నాతో మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పాను. అంది! ఓ అదా అలవాటు అన్నాను. 'అపారపాటే చెయ్యొద్దని ఎన్నిసార్లు చెప్పి ఉంటానంటారు?'' అంది. ఇలా ఎప్పుడో ఒకప్పుడు అకస్మాత్తుగా అడిగుండేవారని ఓ సారీ అడిగుండేదానివని తెలిస్తే లెక్ఖపెట్టి ఉండే వాడిని' అన్నాను. ఇంతలో మద్రాసు సిటీలే లేడీస్ కార్నర్ దగ్గిరకు వచ్చింది కారు. అపాను. 'ఊ దిగు అన్నాను. ఆమె దిగింది. 'మీరురారా' అంది. 'కారుని ఇలావదిలేసే! పార్క్ చేసి వస్తాను. అయినా నేనెందుకు?'' ఏమో కారుని పార్కు చేసి

కార్నర్‌లోనికి వచ్చాను. కౌంటర్ దగ్గిర ఉన్న మేనేజరుతో ఓ చిన్న హస్కు-వేసాను అరగంటపైపడినా తెమలందే! అబ్బబ్బ! ఈ ఆడవాళ్ళకు ఓపట్టున ఏదీ నచ్చదు! నచ్చిందాన్ని అంతలో వదిలిపెడ్తారా? అదీ లేదు! 'సారీ లేటయిపోయింది.' అనుకుంటూ మరో పావుగంటకు వచ్చింది. కారు తీసుకొస్తాను బిల్లు ఇచ్చేయండి అని పార్కింగు దగ్గిరకు వెళ్ళింది. బిల్లు చెల్లించి పేకింగ్స్ M. S.X 3546 దగ్గిరకు పంపించమని చెప్పి కార్నర్ మెట్లు దిగుతున్నాను. కార్నర్ ముందర కారు ఆగింది. డ్రయివర్ 'కారుని పార్క్-చేసిరా' అన్నమాటలు కార్లోంచి వచ్చాయి! ఆ మాటలు నాకు చాలా పరిచయమయినవి! కాని ఆవ్యక్తి...ఆమె 'కారుదిగింది!' ఆమే! జానకి! ఎవరి ఎదురుగురించి నిరీక్షిస్తున్నానో ఆమె జానకి! ఆమె వస్తున్నదల్లా నన్ను చూసి ఆగిపోయింది! ఆశ్చర్యపోయింది! 'జానకీ!' ఎంతోగట్టిగా అరవాలనుకున్న ఉద్దేశం పెదవిదాటి బైటికి రాలేకపోయింది! పార్కింగులోంచి కారుని తీసుకువచ్చిన సావిత్రి 'రండి నిలబడి పోయేరం' అంటూ దగ్గిరకు వచ్చింది. ఆ మాటలు మళ్ళీ నన్ని ప్రపంచంలోనికి తెచ్చాయి! ఏమనాలో ఏం మాట్లాడాలో ఆక్షణంలో ఏం తోచింది కాదు! 'బాయ్‌ను పేకింగ్స్ తెమ్మన్నాను...' అనబోయాను. ఇంకా ఏదో కాని, సావిత్రి తెచ్చి చాలా సేపయింది కాని రండి' అంది, మమ్మల్ని చూసిన జానకి గబగబ మెట్లెక్కి-పోయింది. నేను సావిత్రితో వెళ్ళక తప్పలేదు! ఆమే డ్రయివ్ చేస్తానంది. వద్దనే స్థితిలో లేని నేను సరే అని కూర్చున్నాను, కారు కదిలింది, కాని నాకళ్ళముందు జానకి రూపం కదలలేదు! ఆ జానకేనా? ఎంతగా మారిపోయింది! 'ఏమిటి ఆలోచిస్తున్నారు!' అంది సావిత్రి నా ఆలోచననిభంగపరుస్తూ! 'ఊ ఏం లేదు' అన్నాను. ఎందుకంత ముభావం. ఓ నేను ఆలశ్యం చేసానని కోపమా అంది! పిచ్చిది! ఒకరి ప్రవర్తనని ఎంతమంది ఎన్నివిధాలుగా ఊహించుకుంటారని! ఎవరి అద్దంలో వాళ్ళు చూసుకుంటేగాని తృప్తి ఉండదేమో? 'అబ్బే ఎంతసేపు చేసావని కోపం రావటానికి' అన్నాను. మరెందుకలా ఉన్నారు' సంభాషణ పెంచింది. నిశ్శబ్దాన్ని కోరుకునే నా పరిస్థితి ఆమె కర్థమవదు! 'ఏంలేదు తలభారంగా ఉంది.'అన్నాను 'పోనీ కాఫీ తాగుదామా' ఆపలేదు ఆమె!' అబ్బే ఎందుకు అదే తగ్గిపోతుంది అన్నాను. బంగళా వచ్చేసింది, కారు దిగి మేడమీదికి వెళ్ళాం ఆమె లోనికి వెళ్ళిపోయింది! భగవద్గీత చదువుకుంటున్న వెంకటాచలం గారు నన్ను చూసి 'అయిపోయిందటయ్యా! షాపింగ్' అన్నారు. ఆయనకు బిల్లు మిగత డబ్బు ఇస్తూ అవునండీ నాకు తలబారంగా ఉంది వెళ్ళొస్తాను అన్నాను. ఆయన దానికి అరే అలాగటోయి అయితేకారు తీసుకుని ఇంటికి వెళ్ళిపోయి విశ్రాంతి తీసుకో' అన్నారు. వెంటనే దిగి వచ్చి కారులో కూర్చున్నాను. 'ఎక్కడికి వెళ్ళాలిని' ఏమో! యాంత్రికంగా స్టార్టు చేసాను, కదిలింది! కారు చప్పుడు తప్ప మరేది భంగపరచని అనిశ్శబ్దంలో జానకి గురించి ఆలోచన కదిలింది! ఎన్నాళ్ళ తర్వాత కనపడింది! ఇన్నాళ్ళు ఎక్కడుంది? అయిదారేళ్ళ క్రితం బాధతో బరువుతో ఇల్లు విడిచిన జానకేనా? ఈ కాలం ఆమెని ఎంతగా మార్చేసింది! అయిదారేళ్ళ క్రితం నా కళ్ళముందు కట్టినట్లయింది...

(సశేషం)

# అకితం

(గత సంచిక తరువాయి)

అప్పుడు మేం ఏలూరులో ఉండేవాళ్ళం. అవి నేను బి.ఎ. ఫైనలియల్ పరీక్షలు వ్రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తూ గడిపే రోజులవి! రోజూ ఉదయం, సాయంకాలం లైబ్రరీకి వెళ్ళి వస్తూ ఉండేవాడిని! ఒక రోజు ఉయం లైబ్రరీకి వెళ్ళి వచ్చాను. ఇల్లు సందడిగా ఉంది. ఇంటికి ఎవరో వచ్చి నట్లున్నారు. అమ్మ ఎవరితోనో మాట్లాడు తున్నాది. నేను నాగదిలోనికి వెళ్ళిపోబో తున్నాను. 'ఒరే రామం' అమ్మ కేకేసినట్లు పిలిచింది. వెళ్ళాను. వీడే పెద్దవాడు రామం అంది అమ్మ ఆవిడకు నన్ను చూపిస్తూ. అవును నాలుగో ఏడు దాకా ఎత్తుకుని తిప్పే దాన్నిగా ఇతను పుట్టిన నాలుగేళ్ళకేగా జానకి పుట్టింది. అప్పుడే వీరు భద్రాచలంనుంచి ట్రాన్సఫర్ అయి వెళ్ళిపోవటం అంది ఆవిడ. 'అన్నీ ఒక్కసారే' అంది అమ్మ 'అయితే వదినా అబ్బాయి ఏం చదువుతున్నాడు ?' అందావిడ, మొన్నే బి. ఎ. ఆఖరేడు పరీక్షలు వ్రాసాడు. ఇంకా ఏదో సాగిపోతుంది వాళ్ళ సంభాషణ. నేను మెల్లిగా బయటపడి నాగదిలో అడుగుపెట్టాను.' మా అన్నయ్య దగ్గిర ఎన్ని పుస్తకాలున్నాయో తెలుసా... ఆ ఇదో ఇదే మా అన్నయ్యది నాది ఫోటో ...అన్నయ్య నన్ను ఎత్తుకుంటే బెజవాడ మావయ్య తీసాడు' అని ఎవరికో చూపిస్తూ చెప్తున్నాడు, ఆమె అటు వేపు తిరిగి ఉంది, తెల్లటి పరికిణీ మీద ఎర్రటి వల్లెవాటు ఆ పైన మల్లెపువ్వులాంటి జాకిట్టు! పెద్ద జడ! అంత పెద్ద జడకి ఒక్కటే ఒక్క తెల్ల గులాబీ పువ్వు! పద్దెనిమిదేళ్ళయినా నిండీ



భరణీవారి

'వివాహబంధం'లో

శ్రీ ఎన్. టి. రామారావు

శ్రీమతి భానుమతి.

ఉండని ఆమె! ఎవరు? 'ఇతడు పుట్టిన నాలుగేళ్లకేగా మా జానకి పుట్టిందీ' అవిడ అన్న మాటలు గుర్తుకొచ్చింది! అయితే ఈమె ఆ జానకి! ఇంతలో ఆమె మరి మీ అన్నయ్య ఎక్కడికి వెళ్ళారు? అని తమ్ముడు రవిని అడుగుతోంది, ఊ మరి అది-అదేంటో పుస్తకాలు ఇస్తారే అక్కడికి రోజూ వెళ్తాడు అంటూ నా వేపు చూసాడు ... చూసాడో లేదో అదుగో అన్నయ్య వచ్చాడు. అన్నాడు, ఆమె ఇటువైపు తిరిగింది! నన్ను చూసి గదలోనించి అటువైపుగా వెళ్ళిపోయింది! 'ఎలా చూసినా అందంగానే ఉంటుంది.' అన్న నా భావన నిజమయింది! పేరు కూడా చాలా అందంగా కుదిరిం! జానకి!

మధ్యాహ్నం భోంచేస్తుంటే అమ్మని అడిగాను 'ఎవరమ్మా వాళ్లు' అని. 'నీకు తెలీదురా నువ్వప్పుడు చాలా చిన్నవాడివి. భద్రాచలంలో మీనాన్నగారుండేవారు.

రచన:
శ్రీ అలమూరు
సూర్యవెంకటరమణరావు.

మనం వీళ్ళింట్లో ఉండేవాళ్ళం. మీనాన్నగారు ఆయనా ప్రాణస్నేహితులు! మన నియోగులు కాకపోయినా ఆయన చెల్లెమ్మా అని, ఆవిడ వదినా అని ప్రాణంపెట్టేవారు. పదేళ్ళు దగ్గిర దగ్గిర కలిసి ఉన్నాం. అప్పట్లో బాగా కాకపోయినా ఒక మోస్తరుగా స్థితిపరులు. కాని ఈ పద్దెనిమిదేళ్ళలోపునా బాగా ఆర్థికంగా చితికిపోయారు. నాన్నగారికి తెలిసి రమ్మంటే వచ్చారు...ఆపిల్ల ఒక్కర్తె వాళ్ళకి! ఆ పిల్లని ఎవరికో ముడిపెట్టేస్తే వాళ్ళకింక బాధ్యతా లేదు అని ఆపింది అమ్మ! భోంచేసి రూములోకివచ్చి కూర్చుని ఏం చదువుదామా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో తమ్ముడు రవి వచ్చి

*

విజయవాణి ఫిలింసు వారి
'ముగ్గురమ్మాయిలు
మూడు హత్యలు'లో
శ్రీమతి సావిత్రి.

*



అన్నయ్యా వదిన ఉదయం మనింటికి వచ్చిందే ఆవదిన ఏదయినా పుస్తకం ఇమ్మంది' అన్నాడు చదువుకుంది కూడా! అనుకుని పోరంకి దక్షిణామూర్తిగారి 'వెలుగూ వెన్నెలా - గోదావరి' ఇచ్చి పంపించాను. ఓ గడియ ఏదో చదివి పడుకున్నాను, నాలుగ్గంటలకి తెలివి వచ్చింది. లేచి టేబిల్ దగ్గరకు వెళ్ళేసరికి మధ్యాహ్నం చదవడానికని ఇచ్చిన పుస్తకం తిరిగి ఒచ్చేసి ఉంది! అప్పుడే చదివేసిందా! స్నానం చెయ్యాలని బావి దగ్గరకు వెళ్ళేసరికి నీళ్ళు తోడుతోంది జానకి! టవల్, సబ్బు బావిగట్టుమీద పెట్టి 'అప్పుడే ఆపుస్తకం చదివేసారా' తొలిసారిగా మాట్లాడానామెతో! ఇందాకటిలా నన్నుచూసి వెళ్ళిపోలేదు పైగా ఆ పుస్తకం చదువుతూంటే ఎప్పుడో చదివినట్టే అనిపించింది... కొంచం చదివి వదిలేసాను అంది అతి చనువుగా! మరి అడగలేక పోయూరా మరో పుస్తకం ఇచ్చుండేవాడిని అన్నాను. అడుగుదామనే వచ్చాను, కాని మీరు నిద్రపోతున్నారు, పుస్తకం టేబిల్ పై నుంచి వచ్చేసాను అంటూ నీళ్ళు తీసుకుని వెళ్ళిపోయింది! స్నానం పూర్తిచేసి లైబ్రరీకి బయలుదేరాను. వరండాలో నాన్నగారు, మరో కొ త ఆయన కూర్చుని మాట్లాడుతున్నారు. నన్నుచూసి 'వీడే. మాగామం మీరు చాలా చిన్నప్పుడు చూసారు' అన్నారు. అవునవును చిన్నప్పుడు తెగ అల్లరి చేసేవాడు అన్నారాయన. నాన్నగారు ఆయన్ని నాకు చూపిస్తూ ఈయన పరంధామయ్య మామయ్యగారని నీకు తెలీదులే" అని పరిచయం చేసారు. నేను లైబ్రరీకి వెళ్ళి పుసకాలు మార్చి కొత్తవి తీసుకుని వచ్చేసాను. భోంచేసి నా రూములో కూర్చుని నందివాడ భీమారావుగారి 'కన్నీరు - పన్నీరు' చదువుతున్నాను, పాలు తీసుకుని జానకి నాగదిలోనికి వచ్చింది! ఆశ్చర్యపోయాను! అవును రోజూ అమ్మ తీసుకొచ్చేది మరి! ఆమె రాగానే అదేవిటి మీరు తీసుకొచ్చారు అమ్మ ఏం చేస్తున్నది? అన్నాను. ఎవరయితేనేం మనపని మనంచేసుకోవటంలో తప్పులేదుగా అంటూ ఎదురుగా ఉన్న కుర్చీమీద కూర్చుని మళ్ళీ ఏవయినా కొత్త పుస్తకాలు తెచ్చారా? అడిగింది 'అవును' అని తెచ్చిన పుస్తకాలు చూపించాను. లతగారి 'వారిజ' తీసుకుని చదివిస్తాను అంది. 'తీసుకెళ్ళండి' అన్నాను. వెళ్ళిపోతున్నదల్లా వెనక్కి తిరిగి 'ఆ చూడండీ మీ కన్నా చిన్నదాన్ని, గౌరవించడం, అండీ గిండీ అనిపిలవటం - ప్రత్యేకంగా చూడటం చాలా బాధగా ఉంటాయి' అని వెళ్ళిపోయింది! ఎంతలో మనలో ఒకరిగా మసలిపోయింది! అందం, గుణం, విజ్ఞానం అన్నిటిలోనూ మిన్న అయిన ఆ జానకే నా జీవితంలో మొట్టమొదటిసారిగా పరిచయమయిన మగువ! ఆమెలో అందంకన్న ఆకర్షించుకునేదేదో ఉంది! ఏవిటది? ఏమో! అంత వేగంగా అదేదో తెలుసుకోటానికి తనెప్పుడయినా ఏ అమ్మాయి గురించయినా ఆలోచించాడు కనకనా! పు కం కళ్ళముందుంది. అతు

రాలు కనపడుతున్నాయి కాని అర్థంకాటం లేదే! పుస్తకం మూసేసి లైటార్పి పడుకున్నాను. 'రోజూ ప్రపంచం పెరిగిపోతున్నాది! కాదు కాలం మారిపోతున్నాది' ఎవరో లైబ్రరీలో వాదించుకోడం జ్ఞాపకం వచ్చింది! మార్పు మానవసహజం! అవును నేనూ మారేనా? ఎప్పుడూ దానిగురించి ఆలోచించలేదు. మంచం చూడగానే ముంచుకొచ్చే నిద్ర ఆరోజు చాలాసేపటికి గాని రాలేదు! మారటం ప్రారంభించేనేమో!

అలా జానకితో నా పరిచయం గంటల నుంచి వారాలు వారాల నుంచి నెలలు పెరిగింది! జానకితో సన్నిహితం చాలవరకు పెరిగింది! జానకిని చూడకపోతే, జానకితో మాట్లాడకపోతే ఏదో వెలితిగా ఉండేది! అందులోకీ శెలవులు. మధ్యాహ్నం అమ్మావాళ్ళు ఎవరింటికో పిచ్చాపాటికి వెళ్ళేవారు! నేనూ జానకి ఉండేవాళ్ళం. ఏ పుస్తకంగురించో, ఏ సినీమా గురించో వాదించుకునేవాళ్ళం! ఆ రోజులు ఎంతో సరదాగా గడచిపోయేవి! జానకితో మాట్లాడుతూంటే గంటలు, రోజులు, నెలలు, సంవత్సరాలు యుగాలు గడచినా కాలం తెలిసేదికాదు! జానకి! ఎక్కడ చూసినా జానకే! ఇలా మాకు తెలియకుండా చాలా రోజులు గడిచిపోయేయి! ఏవాదనో శృతి మించితే రాగాన పడటం, అలగటం, చిన్న తగవు, ఎంతసేపు అదే! జానకే మళ్ళీ చనువుగా తీర్చివేసేది ఆతగవు! అరోజులు వేరు! అవి మరిరావు! కాలం మింగేసింది!

అంత సరదాగా ఎంతో ఉత్సాహంగా సాగిపోతున్న అరోజుల్లో ఒకరోజు...!

నాన్నగారు, పరంధామయ్య మావయ్యగారు కేంపు వెళ్ళారు. ఆరోజు సాయంకాలం లైబ్రరీకి వెళ్ళి తిరిగి వచ్చేసరికి ఇంటికి తాళంవేసి ఉంది! నన్నుచూసి పక్కింటి వాళ్ళబ్బాయి తాళం పట్టుకొచ్చి ఇస్తూ వాళ్ళు హరికథకు వెళ్ళారని వచ్చేసరికి ఏ తొమ్మిదో అవుతుందని అంతవరకూ ఉండలేకపోతే బోజనం పెట్టుకుని తినమని చెప్పారన్నాడు. సరే అని తాళంతీసి నా గదిలో కూర్చుని ఆరోజు తెచ్చిన 'స్వయంసిద్ధ' ఆఖరిభాగం చదువుతూ కూర్చున్నాను. కాలం తెలియకుండా గడచిపోయింది! తొమ్మిది గంటలు దాటింది! అనుకుంటున్నంతలో తలుపు చప్పుడయింది, లేచి వెళ్లి తీసాను. రవిని ఎత్తుకుని జానకి వచ్చింది! అమ్మావాళ్ళు వస్తున్నారేమోనని చూసాను: కాని రాలేదు. తలుపు గడియ పెట్టిలోపలికి వెళ్ళాను. రవిని మంచంమీద పడుకోబెట్టి వస్తున్న జానకిని 'అమ్మావాళ్ళు రాలేదేం జానకీ?' అని అడిగాను. ఎవరో రమ్మని బలవంతం చేస్తే అక్కడినుంచి సినీమాకు వెళ్ళారు! పడుకున్న రవిని లేపితే అల్లరి చేస్తాడని, ఆరోగ్యం పాడవుతుందని తీసుకుని నేను వచ్చేసాను అంది. ఇంకా టైం ఉందిగా రిక్షా చేయించుకుని వెళ్ళొచ్చు వెళితే వెళ్ళు అన్నాను. 'పడుకోబెట్టి రమ్మన్నారు కాని రాలేను బాబూ' అని చెప్పి వచ్చేసాను, అంది. 'అ మీరు భోంచేసారా?'

అంది. 'ఊహు లేదు మీరు వస్తారేమోనని చూస్తున్నాను' అన్నాను. 'అరె అయితే రండి వడ్డిస్తాను' అంది. భోంచేసి రూములోకి వచ్చాను. పాలు తెచ్చి ఇచ్చింది. 'వేడిగా ఉన్నాయి ఇప్పుడు కాచేవా' అన్నాను. 'ఫ్లాస్కులో పోసి ఉంచాముగా' అని వెళ్ళి పోయింది, పాలు తాగేసి డైరీ వ్రాసి లైటార్పి పడుకున్నాను. నిద్రపట్టలేదు!

నిర్మలంగా ఉన్న ఆకాశంలో ఎక్కడి నుంచి వచ్చాయో ఆ కారుమబ్బులు! అసలే చీకటిగా ఉన్న ఆ రాత్రిని మరింత చీకటి చేసేసాయి! వెంటనే మొదలుపెట్టిన ఈదురు గాలి కొద్ది నిముషాలలో పెనుగాలిగా మారింది! ఆకాశం నిండా మెరుపులు ఉరుములు! తుంపరలతో మొదలయిన వాన పెద్దదై కురవసాగింది! ఎంతసేపులో జరిగింది ఇందంతా! అందుకే 'వానరాకడ ప్రాణ పోకడ' తెలియవు అన్నారు అనుభవజ్ఞులు. కిటికీలోంచి గాలి వస్తున్నా తలుపులు ముయ్యడానికీ బద్దకమయి పడుకున్నాను చీకటిలోకీ చూస్తూ! ఉన్నట్లుండి తలుపు కిర్రుమంది! ఏ కిటికీ రెక్కో అనుకున్నాను. ఇంక గాలికి కొట్టుకుంటాయి, వేసేద్దాం అని లేచాను. ఓ అ కాని కిటికీ తలుపు కాదు! గుమ్మం దగ్గిర తలుపు! అటువేపు చూసాను! చీకటిలో ఒక మానవ అకృతి! కదలికలో గల్లుమనే గాజుల చప్పుడు! నడిచే కాళ్ళ మధ్య నలిగే పరికిణీ రెపరెపలు!. మత్తును కలిగించే పువ్వుల వాసన! ఇవన్నీ దగ్గిరకు వచ్చాయి! ఎవరు?' అన్నాను. అప్పటికే ఆ చేతులు నన్ను గట్టిగా బంధించాయి!

(సశేషం)

---

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులు కాము.

—సంపాదకుడు.

---

(౨౮ పేజీ తరువాయి)

అని చెపుతూ ఖాలి అయిన కాఫీ కప్పు టేబిలుపై వుంచాడు.

అంతా ఆ పరమేశ్వరుని లీల...దాని ఆయుస్సు గట్టిది' అన్నాడు, చంద్రిక తండ్రి డాక్టర్ వైపుచూస్తూ.

కబుర్లతో కాఫీ త్రాగడం పూర్తయిన తరువాత, డాక్టరుగారు వెళుతు వెళుతూ ఏమండీ బెంగుళూరు పయనానికి మీతోడం అవసరం లేదుగానీ, నామాట మీదైనా గౌరవముంచి మనోహర్ వెంబడి చంద్రికను కూడ పంపండి. ఆమె ఆరోగ్యానికేంభయం లేదు అన్నారు.

అ ఇరువురు పెద్దలు ఆశ్చర్యంగా డాక్టర్ వెళుతున్న వైపుచూస్తూ 'అదాసంగతి' అనుకొన్నారు.

---


# కథాంజలి

[కథల మాసపత్రిక]

స్థాపితము 1938

విడి ప్రతి. ... 25 పై.

సంవత్సర చందా. ... రూ 4-00.

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్‌లోనూ దొరుకుతుంది.

# అంకితం

రచన :
శ్రీ. అలమూరు సూర్య వెంకటరమణరావు

(గతసంచిక తరువాయి)

ఎన్నడూ కలగని అనుభూతి ఏదో నిర్వచించలేని అనుభవం-ఇదివర కెన్నడూ రుచి చూడని హాయి! 'ఎవరు?' అన్నాను అప్రయత్నంగా! 'అబ్బ ఎవరో గుర్తించలేవా' అంది! జానకి! 'జానకీ!' అన్నాను కాస్త గట్టిగానే! 'ఊ' అంది! 'ఎందుకు నీ ఒళ్ళిలా కాలిపోతోంది' రమ్మంటే నేను వచ్చేవాడినిగా ఉండు లైటు వేస్తాను' అన్నాను. 'ఒద్దు' అని వారిచింది! 'నా ఒళ్ళూ కాలిపోతున్నాది! నా రక్తం ఉడికి పోతున్నాది... నువ్వు తెల్సుకోలేకపోతున్నావు' అంది. 'ఏవిటీ జానకీ? ఏవిటి మాట్లాడేస్తున్నావు పిచ్చిదానిలా' అన్నాను. 'అవును రామం! పిచ్చిదాన్నే అయిపోయాను' అంటూ నా మొహం రెండు చేతులతోనూ దగ్గిరకు తీసుకోబోయింది...ఆకాశం ఒక్కసారి మెరిసింది! చీకటిలో వెలుగు ఒక్కక్షణం గుప్పుమంది! ఆ వెలుగు ఒక్కసారి జానకి మొహం మీద పడింది! ఆ వెలుగు ఒకక్షణంలో ఆమె తను మూసి ఉన్న కళ్ళను బరువుగా తెరిచింది! ఆ కదలికలో గూడు కట్టుకున్న కోరికలో అర్థం మెరిసిన మెరుపు నా మదికి తెలిపి మరుగయింది! ఒక్కగడియ ఆలసించినా అనుకోని అనర్థం జరిగిపోతుంది! 'జానకీ!' ఈసారి ఇంకా గట్టిగా అరిచి ఉంటానేమో!'నీ ఇష్టం రామం! నన్నేమయినా చేసెయి నేను నీ దానిని!' ఇంకా పిచ్చిగా మాట్లాడుతున్నాది! ఏం చెయ్యాలి? ఆ పరిస్థితికి లోనయి పోకుండా మెలకువలో ఉన్న నేనూ మూర్ఖణ్ణయి ప్రవర్తిస్తే అర్థం ఏముంది? ఆ అవస్థనుంచి ఆమెని తప్పించటానికి ఎవరిముందూ అంత కఠినంగా ప్రవర్తించలేని నేను చాలా బలంగా ఆమె చెంపమీద కొట్టాను. ఆమె నన్ను వదిలింది! ఇందాకల మెరసిన మెరుపుఫలితంగా ఎక్కడో పిడుగు పడింది! ఆ శబ్దంలో జానకి వెళ్ళిపోయిన అడుగుల చప్పుడు కలిసి పోయింది! లైటు వేసాను. చీకటి పోయింది! జానకి వెళ్ళిపోయింది! ఆ వెలుగు చూడలేక పోయాను! లైటార్పి మంచంమీద పడిపోయాను! చాలా కఠినంగా ప్రవర్తించానా! నా చెయ్యి చీకటిలో చూసుకున్నాను. ఇన్నాళ్ళ మా అనుబంధం ఈఅనుకోని అవాంతరం తెంపేస్తుందా! వెళ్ళిచూస్తే...ఒద్దు! ఇలా సతమతమయ్యే ఆలోచనలతో పరిష్కారం అవని-అవలేని సమస్యలతో చాలా భయంకరంగా గడుస్తున్న ఆ రాత్రి తెల్లవారుతుందా? ఊహు తెల్లవారితే జానకిని చూడగండా! ఒద్దు ఈ రాత్రి తెల్లారొద్దు! అలా ఎప్పుడు నిద్రపోయానో తెలియదు! చాలా ఆలస్యంగా లేచాను!

లేచి కాలకృత్యాలు పూర్తి చేసుకుని గదిలో కూర్చున్నాను. కాఫీ తీసుకుని జానకి నా గదిలోనికి వచ్చింది! నిజానికి జానకిని చూడలేక పోయాను! పేపరు మొహానికి అడ్డు

పెట్టుకుని చదువుతున్నట్లు కూర్చున్నాను. అమే 'ఇదిగో కాఫీ' అంది! పేపరు అడ్డం తీసి ఆమెని చూసాను. చాలా నిర్మలంగా ఉంది ఆమె! కాఫీ తీసుకోగలిగాను! ఆమె వెళ్ళి పోయింది! నేను యధావిధిగా లైబ్రరీకి వెళ్ళి వచ్చాను. వాచీతీసి డ్రాయరులో పెట్టాలని డ్రాయరు తీసాను ఉత్తరం! పైన ముత్యాల్లాంటి అక్షరాలతో 'ప్రియమయిన రామంకి' అని ఉంది. ఆత్రుతతో తీసాను,

ప్రియమయిన రామంకి,

నమస్కరిస్తూ జానకి!

మనసులో ఉన్నది మాటల్లో చెప్పలేని, చెప్పుకోలేని బలహీనులు, రాత్రి నేను చేసిన లాంటి పొరపాట్లు చేస్తూంటారు! సహృదయం, సాటివారిమీద సానుభూతి ఉన్న నీలాటివాళ్ళు మన్నిస్తారు. లేనివాళ్ళు ద్వేషిస్తారు. తప్పు చేసింతర్వాత శిక్షకయినా క్షమకయినా సిద్ధంగా ఉండాలి! నువ్వేం చేసినా నేను చెప్పేది ఒక్కటే 'మనసేదో నాకున్నాదని తెలుసుకున్న క్షణంలోనే అది నీ కిచ్చి వేసాను!' నేను కోరుకునేది ఒకటే చిరకాలం నీ పాదాల నీడలో నివసించగలిగే భాగ్యం కలిగించమనే!

శిక్షకయినా క్షమకయినా
నీ నుంచి నిర్ణయం ఆశించే
జానకి!

ఆ ఉత్తరాన్ని ఎన్నోసార్లు చదివాను! జానకి మనసు నా దగ్గిర ఉందా! ఉందేమో! మరి నా మనసు? అప్రయత్నంగా గుండెల మీదకు చెయ్యి వెళ్ళింది! తడుముకుంటే మనసు లేనట్టనిపించింది! అప్రయత్నంగా కాగితం కలం తీసుకున్నాను ఉత్తరం రాద్దామని ఉద్దేశం! చాలా కాగితాలు పాడయి పోయాయి! ఆఖరికి పూర్తయింది!

కొద్దిక్షణాలక్రితమే నాదని తెలుసుకున్న ప్రియమైన నా జానకికి నీ రామం.—

జానకీ!

'చేసిన తప్పుకి శిక్ష వెయ్యడంకన్న క్షమించడంలోనే మానవత్వముంది! అయినా నువ్వేం తప్పు చేసావని క్షమించగలను! నేనే నిన్ను కొట్టి బాధించాను. అదికాదు జానకీ! ఆ పరిస్థితికి ఇద్దరమూ తలవంచితే ఎంత అనర్థం జరిగిపోతుంది తెలుసా! తెలియకుండా నిప్పులో చెయ్యిపెట్టి కాల్చుకునా 'అయ్యో! పాపం' అని ఆదరించేవాళ్ళు ఫరవాలేదని ఓదార్చేవాళ్ళు ఉంటారు! నిప్పు అని తెలిసుండీ చెయ్యి కాల్చుకుని ఏడ్చేవాళ్ళని ఎవరు ఓదారుస్తారని! జానకీ? నీలాటిది జీవితంలో భాగంపంచుకుంటానంటే ఒద్దనేవాడు ఉంటాడా? కాని మన పరిస్థితులు రైలు పట్టాలమాదిరి ఉన్నాయి. వాటిని కలపాలంటే సమయం రావాలి! అవి కలియవన్న వాదంఒట్టిది! మానవులే తలుచుకుంటే చెయ్యలేని కార్యం లేదని నా విశ్వాసం! అయినా దానికి కాలం అనుకూలించాలి! అంతవరకూ ఓపిక-స్థైర్యం సమకూర్చుకోవాలి! క్షణం సుఖంకోసం బలిఅయితే శాశ్వతం దుఃఖమయమవుతుంది! మనం మానవులం! అలా పుట్టడమే ఒక పొరపాటు! అలాటి పొరపాటు జన్మలో పొరపాట్లు చెయ్యకుండా

తప్పించుకునేవాళ్ళు ఎవళ్ళూ ఉండరు. దానికి బాధపడకు! జరిగిన ఈ సంఘటన మన సన్నిహితాన్ని సాంగత్యాన్ని విడదీస్తుందేమోనని రాత్రి అల్లా భయపడ్డాను. కాని ఇది మరింత అనుబంధాన్ని పెనవేసింది!''

ఇది శాశ్వతమవాలని జన్మ జన్మాలకూ నిలిచి పోవాలని కోరుకునే—నీ **శాంతం**!

మధ్యాహ్నం భోంచేసి తమ్ముడు రవితో పంపించిన పుస్తకంలో పంపించా నీ ఉత్తరం. సాయంకాలం బావి దగ్గర 'అయితే కోపం పోయినట్లేనా' అంది. 'ఎవరికి?' అన్నాను. కిలాకిలా నవ్వి వెళ్ళిపోయింది! పెనుతుఫాను అలగారిన తర్వాత ప్రకృతి మరింత ప్రశాంతంగా ఉంటుంది!

ఈ సంఘటనతో మాలో తెలియని అనుబంధం, ఆశ రోజురోజుకీ పెరగసాగాయి! ఈ రోజుల్లోనే ఒచ్చాయి మా ఫలితాలు! ఒక్క నిముషం వృధా చెయ్యకుండా చదివిన చదువంతా వృధా అయిపోయింది! కష్టంకి ఫలితం కనపడలేదు! నాలో నిరాశ అంకురించింది! ఆ రోజు రాత్రి ఎంతో విచారిస్తూ గది కూర్చున్నాను. పాలగ్లాసుతో వచ్చి నన్నూ నా పరిస్థితిని చూసిన జానకి దగ్గరకు వచ్చి అప్యాయంగా 'పరీక్ష పోయిందని లేని నిరాశని పెంచుకోవద్దు. కష్టపడటమే మనవంతు! ఫలితం మనం నిర్ణయించగలిగే సమర్థులమే అయితే కష్టపడాల్సిన అవసరమేమీ లేదుగా! తలచుకుంటే మానవులు సాధించలేనిదంటూ ఏదీ లేదనే మీ బలీయమైన అత్మవిశ్వాసాన్ని అంతలోనే అపార్థం చేసుకోవద్దు! లెండి చదవండి!' అని నాకో కొత్త ఉత్సాహాన్నిచ్చి మళ్ళీ నన్ను చదవడానికి, చదవగలిగే శక్తి ఉందని తెలుసుకో అవకాశమిచ్చింది. మళ్ళీ యధావిధిగా చదువు మొదలు పెట్టాను!

(సశేషం)




# అంకితం

రచన:
శ్రీ. అలమూరు సూర్యవెంకటరమణరావు

(గతసంచిక తరువాయి)

భగవంతుని మనః ప్రవృత్తి అతి విచిత్రంగా ఉంటుంది! అటువంటి పరిస్థితుల్లో 'మనకు మనసు సృష్టించే ఈ భగవంతుడికి మనసు ఉందా' అన్న అనుమానమూ వస్తుంది. ఒకరోజు మధ్యాహ్నం నా గదిలో కూర్చుని నేను చదువుకుంటున్నాను. బయట వరండాలో కూర్చుని మాట్లాడుతున్న అమ్మ, జానకి వాళ్ళమ్మతో 'అయితే వదినా ఉదయం అన్నయ్యగారు పెళ్ళివారింటికి వెళ్ళి వచ్చారు కదా ఏం అన్నారేం?' అంది. ఆవిడ 'ఫోటో చూసారు. చూడగానే నచ్చింది అన్నారుట. కట్నం విషయంలో పట్టింపు లేదని, పెళ్ళి వారం రోజుల్లో మాత్రం జరిపించాలని అన్నారుట. అమ్మాయి జాతకం ఈయన తీసుకువెళ్ళారుగా చూసారు. కుదిరిందిట. వచ్చే యిరవయ్యో తేదీన ముహూర్తం పెట్టుకొని వచ్చారు. మీ అన్నయ్య గారేం సామాన్యులా అమ్మా' అందావిడ! చేతిలో పుస్తకం జారిపోయింది! జానకికి పెళ్ళా? మాటవరసకయినా తనతో అనలేదే! ఇదేవిటీ అవాంతరం! భగవాన్ ఈ ఉప్పెన మళ్ళీ ఎవర్ని ముంచడానికి! ఏం చెయ్యాలో తోచలేదు! అమ్మావాళ్ళూ అలా వెళ్ళనిచ్చి జానకి దగ్గిరకు పరిగెత్తాను! నన్ను చూసిన జానకి నా పాదాలమీదపడి 'నన్నూ నా ఆశని బలి చేస్తున్నారు! మీనుంచి నా నుంచి నన్ను వేరు చేస్తున్నారు! మనసు మీకిచ్చి ఎవరితోనో మనువు చేసుకుని చూస్తూ బ్రతకటం చాతకాదు! నన్ను మీలో దాచేసుకోండి' ఆమె కన్నీరు ఏరులయి ప్రవహిస్తున్నాది! నా కన్నీరుని నేనే తుడుచుకోలేని పరిస్థితుల్లో ఉన్న నేను ఆమె కన్నీరుని ఎలా తుడవగలను? 'లే జానకీ లే నీకు తెలియదా నా పరిస్థితి! మనం ఒకే బ్రాహ్మణులయి పుట్టినా వేరు వేరు శాఖలలోవారం అయినా నీ కోసం అన్నీ త్యజించగలను. కాని నా బ్రతుకు నేనే పోషించుకోలేని నేను నిన్ను తీసుకుని ఈ సమాజానికి దూరంగా బ్రతకడానికి నాకున్న ఆసరా ఏవిటి? ఈ అవాంతరాన్ని ఏ విధంగా ఆపటం? అసలు పరీక్షపోయినందుకే ఎడమొగం పెడమొగంగా తిరుగుతున్న మా కుటుంబంలో ఈ సమస్యని లేవదీస్తే తుఫాను చెలరేగదా? వీళ్ళందరి అవసరం అనవసరం అనుకుని మనం ఒకదారి ఏర్పరచుకుందామంటే ఏ ధైర్యంతో దాన్ని ఊహించగలం? జానకీ...నువ్వు మా ఇంటికి రాకపోయినా బాగుండేది! వచ్చినా ఈ అభాగ్యుడితో...జానకి నా నోరుకి అడ్డుపెట్టి 'అంత మాటనకండి' అంది. ఇంతలో అమ్మావాళ్ళూ వచ్చారు. అక్కడితో ఆమెకు అంతవరకే ధైర్యాన్నివ్వగలిగాను! జానకీ తొందరపడి నువ్వే అఘాయిత్యం చెయ్యకు. నీకూ-నాకూ బంధం స్థిరమయ్యే అవకాశం భగవంతుడే నిర్ణయిస్తే వీళ్ళెవరూ ఏం చెయ్య

లేదు. అని చెప్పి వచ్చేసాను. ఆ రాత్రి ఆమె నా గదిలోకి వచ్చి పాలు గ్లాసు టేబిలుమీద పెట్టి 'మరిచిపోకు కదూ' అంది. 'మరచిపోవడమా' అని అడిగేలోపుల ఆమె నా గదిలోంచి వెళ్ళిపోయింది!

ఆ రాత్రి వేగం తెల్లారింది! అయిదు గంటలకే తెలివి వచ్చింది! అయిదున్నరకల్లా చదువుకోడానికని లేపటానికి వచ్చే జానకి రాకుండానే తెలివి వచ్చేసింది! ఇంట్లో అంతా హడావిడిగా ఉంది! ఇంకా నిద్రమత్తు, బద్ధకపు బరువు ఒదల్లేదు! అమ్మవచ్చి 'బాబూ రామం లేరా జానకి ఎక్కడికో వెళ్ళిపోయింది!' అంది! మత్తు ఆ క్షణంతో వదిలింది! ఒక్కసారి త్రుళ్ళిపడి లేచాను! 'జానకి వెళ్ళిపోవటమేమిటమ్మా' అన్నాను. 'అవునురా జానకి కనపడటం లేదు...లే లేచి ఒక్కసారి ఆ స్టేషను అవీ చూసిరాబాబూ' అని వెళ్లిపోయింది! జానకి నన్ను విడిచి పారిపోయిందా? ఎక్కడికి? 'జానకీ!' ఆ రోజల్లా పిచ్చివాడిలా తిరిగాను! ఏ బావి దగ్గిర జనం గుమికూడినా ఎంతో భయంతో వణికిపోయేవాడిని! ఏదో అని తెలిస్తే ఎంతో హాయిగా నిట్టూర్చేవాడిని అంత బాధలోనూ! ఎవరో మాటవరసకంటె బెజవాడ కూడా వెళ్ళాను! అన్ని ప్రదేశాలూ గాలించాను. ఫలితం లేక పోయింది. ఆ రాత్రి బండికే ఏలూరొచ్చేసాను. ఇంటికి వెళ్ళడమంటే ఎంతో భయమేసింది! అయినా తప్పదు! నా గదిలో నిర్జీవంగా కూర్చున్నాను. 'వెళ్ళిపోయింది. కనపడటం లేదు ఉదయం-అన్న లోకమే సాయంకాలానికి 'లేచి పోయింది' అనేసింది! లోకం! లేచిపోయిందా? నా జానకి? ఏం తోచలేదు! అమ్మావాళ్ళు పదే పదే పిలిస్తే వెళ్ళి భోజనం చేసాననిపించి వచ్చేసాను! ఆ రోజు డైరీ వ్రాద్దామని తీసాను. ఆ తేదీ పేజీ దగ్గిర ఉత్తరం! ఆశ్చర్య పోయాను! జానకి వ్రాసింది!

ప్రియమయిన రామంకి,
ఆశించిన ఆశయాన్ని నిరీక్షణలో
సాధించాలని ఇల్లు విడిచి వెళ్తున్న
నీ జానకి నమస్కరిస్తూ!—

రామం!

'జానకి వెళ్ళిపోయింది!' ఇంకా నీచంగా 'జానకి లేచి పోయింది!' అని ప్రతీనోటా మీరీ పాటికి వింటూంటారు! మీ జానకిని మీరంత నీచంగా ఊహించరని ఆశిస్తున్నాను. మనసు లేని మనువుతో బ్రతకలేని నేను! ఆశించిన మీకు తప్ప ఇంకెవరికీ నామీద అధికారం ఇవ్వటానికి అంగీకరించలేని నేను ఈ అర్ధరాత్రి మీకయినా చెప్పకుండా ఇల్లు విడిచి పోతున్నాను! పరిస్థితికి భయపడి బ్రతుక్కిబాధపడి ఆత్మ హత్య చేసుకోలేని అసమర్థురాలిని! మనల్ని ఒకటిగా చెయ్యటానికి అనుకూలించే పరిస్థితులు ఆదుకునే లోపల వీళ్ళు చేసే ఈ వివాహానికి బలి అవలేక ఇల్లువిడిచి వెళుతున్నాను. మీరు బెంగపెట్టుకోకండి! ఆ బి. ఏ. పూర్తి చేసెయ్యండి. ఒక మంచి ఉద్యోగం సంపాదించండి! మీ జానకి మీ దగ్గిరకు వస్తుంది. ఇతరులమీద ఆధారపడాల్సిన అవసరం మనకు అనవసరమయినపుడు మన కలయికకు ఈలోకం అంగీకారం, ఆమో

దం చూపుతుంది! అయితే అన్నాళ్ళు ఆడదాన్ని ఏం అవస్థపడతానోనని ఆలోచించకండి! అందరూ పొయ్యిలో నీళ్ళు పోసేవాళ్ళే ఉంటారా? పాలు పొంగించాలనుకునే పుణ్యాత్ములు సహృదయులూ ఉంటారు! అదే విశ్వాసంతో బయలుదేరుతున్నాను. ఈ విషయం మీ మనసులోనే ఉంచుకోండి! ఛా ఏడుస్తారా ఎక్కడయినా! మీ జానకి వెళ్ళిపోయినా దాని పిచ్చి మనసు మీదగ్గిరేఉంది! ధైర్యంతో ఉండండి.

మీదాన్ని కావాలనే ఆశతో
నిరీక్షించే మీ
ప్రియ 'జానకి!'

జానకీ! ఎంత ధైర్యంగా వెళ్ళిపోయావు! మంచిమీద నమ్మకంతో ఇల్లు విడిచిన నిన్ను ఈలోకం ఆదరిస్తుందా? ఆదరిస్తుంది! నీలాటి మంచివాళ్ళకి భగవంతుని సాయం ఎప్పుడూ ఉంటుంది!

ఆ రోజు గడచి పోయింది! జానకి అమ్మా-నాన్న వెళ్ళి పోయారు! మరొక రెండు రోజులు జానకి గురించి పట్టించుకున్న లోకం ఆ తర్వాత మరచిపోయింది! సెప్టెంబరు పరీక్షలూ అయిపోయాయి! ఫలితాలు వచ్చాయి! 'తగిలిన దెబ్బమీదే మరొక దెబ్బకొడితే ఈ మానవుడి ఓర్పు ఎంతవరకూ ఉంటుంది? అని పరీక్ష చేస్తుంటాడు దేవుడు! అలాటి పరీక్షలో నా పరీక్ష మళ్ళీ తప్పింది! అన్నీ తెలిసిన అమ్మా నాన్నలే అనేసారు! ఒకరోజు ఎవరో నాన్నని 'మీవాడి పరీక్ష మళ్ళీ పోయిందటగా ఏదయినా ఉద్యోగంలో చేర్పించెయ్యకూడదూ?' అడిగారు. 'ఆః ముప్ఫయి మూడుసార్లు పరీక్ష తప్పినవాడికి ఉద్యోగమిచ్చే వాడెవడోయి?' అన్నారు. అయితే మరేంచేస్తారు? నాయనా 'ఏం చెయ్యడానికి ఏముంది? ఒంట్లో ఓపిక ఉన్నంతకాలం సంపాదిస్తాను కదా! కడుతూంటాను! మరేవిటి పని?' అన్నారు! అవును కన్న తండ్రీ కావచ్చు. ఎన్నాళ్ళు భరిస్తారు? చెట్టున ఉన్న పరువయినకాయని రాలగొట్టే తప్పని తిట్టేవాళ్ళుంటారు కాని పండిపోయిన పండుని ఏ కాకులో పొడిచి కిందపడేస్తే బాధపడే వాళ్ళుంటారా ఎవరైనా! ఏ వయసులో ఆ గౌరవం! ఇంక ఈ ఇంట్లో, ఈ పరిసరాల్లో మునుపటి గౌరవం లభించటం కష్టం! మళ్ళీ దాన్ని తిరిగి సంపాదించుకునేంత వరకూ...చాలాదూరం వెళ్ళిపోవాలి!ఆత్మాభిమానం అలాటిది! మనసులో మొలిచిన ఈ ఆలోచన-నిర్ణయమయింది! అంతే ఆ రాత్రి నాలుగు గుడ్డలు గల ఓ చిన్న సంచీతో ఆ చీకటిలో అయినవాళ్ల అభిమానానికి దూరమయిన నేను మళ్ళీదానికి దగ్గిరకు రావడానికి చాలాదూరం వెళ్ళి పోవాలనే ఉద్దేశంతో ఇల్లు విడిచాను.

(సశేషం)

---

కథాంజలిలో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులు కాదు. —సంపాదకుడు

# అంకితం X

రచన : శ్రీ, అలమూరు సూర్యవెంకటరమణరావు

(గతసంచిక తరువాయి)

ఏలూరు స్టేషనుకు వచ్చాను! అప్పట్లో అటు మద్రాసువేపు కాని ఇటు కలకత్తావేపు కాని వెళ్ళే రైలున్నూ ఏవీ లేవు! కాని ఒక గూడ్సు బండి మద్రాసు వేపు వెళ్ళబోతున్నాది. ఎలా గోలా ఆ ప్రదేశం విడిచి వెళ్ళిపోవాలి! ఒక్క క్షణం అక్కడుంటే – ఆలశ్యం చేస్తే మళ్లీ వెనక్కి వెళ్లిపోవలసివస్తుంది! వెంటనే ఆ గార్డు దగ్గరకు వెళ్ళి బ్రతిమాలాను. ఆయన ఆదరించాడు నా కోర్కెని! ఓ మూలనిలబడ్డాను! ఆగార్డు, నేను తప్ప ఇంకెవరూ లేరు! నిశ్శబ్దంలో శబ్దం చేసుకుంటూ పరుగెత్తే రైలు అందులోంచి వినిపించేకూత! 'నువ్వెవరు బాబూ!' ఆ గార్డు అడిగారు. నేను... నేను ...చెప్పాను. ఆయన అనుభవం నా సంగతి కనిపెట్టింది! అడిగారాయన అదే! ఆయన ముందు ఏదీ దాచలేక పోయాను...ఆఖరికి అంతా చెప్పేసాను. నా ఆత్మాభిమానాన్ని అభినందించాడాయన! 'మరిప్పుడేం చేస్తావు? అన్నారాయన! అదే నా సమస్య కూడా' అన్నాను. ఆయన ఆలోచించారు. 'సరే నేను ఓ పని చెప్తాను చేస్తావా' అన్నారు. 'తప్పకుండా' అన్నాను. మద్రాసులో నాకో ధనిక స్నేహితుడున్నాడు. మొన్న అతను నాకు తనకో పర్సనల్ సెక్రటరీ కావాలని పేపరులో ఎడ్వర్టయిజు చేస్తే వచ్చేవాళ్ళ గొడవ తాను పడలేనని నా ఎరికలో ఎవరైనా బి. ఎ. దాకా చదువుకున్నవాడు బుద్ధిమంతుడూ ఉంటే పంపించమని వ్రాసాడు. అతనెంత ధనవంతుడో అంతకు మించిన సహృదయుడు! అతని దగ్గిర ఉండి నీ బి.ఎ పూర్తిచేసుకో' అన్నారు. నడివీటిలో కొట్టుకుపోయేవాడు నాచుముక్క కనిపిస్తే ప్రాణాలు దక్కించుకోవాలని ఆశపడ్తాడు. అలాటి వాడికి ఒక తిప్ప కనబడితే వద్దనే మూర్ఖుడా! సరే అన్నాను. బెజవాడలో ఆయన డ్యూటీదిగి ఆరోజు మెయిల్లో మద్రాసు తీసుకువెళ్ళి ఈ వెంకటాచలంగారితో చెప్పి నన్ను పర్సనల్ సెక్రటరీగా నియమించారు. ఆయన పేరు జేమ్సు! క్రిష్టియన్. వెంకటాచలంగారు శుద్ద నియోగి బ్రాహ్మణులు! బంధానికి బంధుత్వానికి శాఖలు ఏర్పరుచుకున్నది మానవులు కాని భగవంతుడు కాదుగా!

ఆ సంఘటన జరిగింతర్వాత అయిదేళ్ళు జరిగిపోయాయి! ఈ లోపున జానకి గురించి ప్రయత్నించని క్షణం అంటూ లేదు! ఆ జానకి ...ఆనాటి నా జానకి ఈరోజు కనబడింది! ఎదురుగా వస్తున్న మరోకారు హెడ్ లైట్సు కళ్ళల్లో పడ్డాయి! కళ్ళు నులుముకున్నాను ఆ కారు వెళ్ళిపోయింది! చుట్టూ చీకటి! ఎక్కడికి వచ్చేసాను? టైంచూసాను. ఎనిమిది గంటలయింది! అబ్బ! గంటన్నరయిందా! కారుని వెనక్కి తిప్పివచ్చిన తోవనే పడితే స్టుడియోకి వచ్చేసరికి పావు తక్కువ తొమ్మిదయింది; ఎంతసేపు తెలియకుండా ఆలోచించాను. ఆ దానికేం గాని జానకిని కలుసుకోవాలి! ఎక్కడ? ఎలా! కార్నర్కి

వెళ్ళి కనుక్కుంటే......గుడ్ అయిడియా! కౌన్టర్ దగ్గరకు వెళ్ళాను! ఒచ్చే జనం పోయే జనం రద్దీ కొద్దిగా తగ్గింది! కౌంటర్ దగ్గిర కూర్చున్నతను ఇందాకలతనే! నన్ను చూసి రండి సార్ రండి ఏం ఇందాకల వాటిలో ఏదయినా నచ్చలేదా - వాపసు చేస్తారా? అన్నాడు నవ్వుతూ! 'అబ్బే అది కాదండి చిన్న ఇన్ఫర్మేషను కావలసివచ్చాను' అన్నాను. 'అడగండి' అన్నాడు. 'చూచారా ఇందాకల మేం బట్టతీసుకు వెళ్తూంటే ఒకామె కారులో వచ్చారు గుర్తుందా?' అన్నాను 'వైట్ ఫియట్ లో వచ్చినావిడా?' అన్నాడు. అది సరిగా గుర్తులేదు. కాని రెడ్ బోర్డర్ మీద వైట్ బ్లౌజు వేసుకున్నారు గుర్తున్నది చెప్పాను. 'ఆవిడేనండీ ఆ ఏం ఎందుకూ?' అన్నాడు. 'అట్టే ఏం లేదు ఆవిడెవరని?' అన్నాను. 'ఆవిడా? రాజశేఖరంగారని ఓ సినీ దర్శకుడు గారి దగ్గిరుంటున్నారు. ఆయన బెంగుళూరు నుంచి వచ్చి రెండు నెలలయింది! ఆయన భార్యేమో! అన్నారు. బుద్ధి తిరిగిపోయింది! 'ఆమె పేరు తెలునా' అన్నాను. 'ఆవిడ పేరు సుజాత అనుకుంటాను' అన్నాడు! సుజాత! జానకి కాదు! కొంచెం హాయి అనిపించింది. కాని ఆమె జానకి కాదా? కాకపోతే నన్ను చూసి ఎందుకు ఆశ్చర్యపోతుంది? ఆమె మాత్రం జానకే! మరితను సుజాత అంటాడు. అనుమానం ఆపుకోలేక మరొకసారి అడిగాను! 'బాగుందండీ మా దగ్గిరకొచ్చిన కస్టమర్సుని మేం గుర్తుపట్టలేకపోయినా-గుర్తుంచుకోకపోయినా వ్యాపారం ఎలా జరుగుతుందండీ' అన్నాడు. అవును అదీ నిజమే! మరయితే అతను చెప్పిందీ నిజమేనా? కాదు - కాకూడదు! అతనికి థేంక్సు చెప్పి కారులో కూర్చున్నాను, పోనిస్తున్నాను. రాజశేఖరం! ప్రతిభావంతుడయిన దర్శకుడని తెలుగుతమిళ నిర్మాతలు బెంగుళూరునుంచి తెప్పించారని తనూ విన్నాడు. వినటంకాదు చూసాడు. అతను అడయార్ లో ఉంటున్నాడని తెలుసును. వెళ్దామా! ఆలోచనకయినా తావియ్యలేని పరిస్థితి అడయార్ వేపు కారు తిప్పించింది!

ఆ యింటిముందు కారాగింది! వాచ్ మెన్ కారు దగ్గిరకు వచ్చాడు! 'డైరక్టరుగారు ఇంట్లో ఉన్నారా?' అడిగాను. 'లేరుసార్ ఓ అరగంట క్రితమే అమ్మగార్ని తీసుకుని ఎక్కడికో వెళ్ళారు. వచ్చేసరికి చాలా రాత్రి అవుతుందని చెప్పారు సార్' అన్నాడు! 'అమ్మగారు!' అంటే జానకి రాజశేఖరాన్ని...... ఆగిన కారు కదిలింది! ఇంటికొచ్చాను. లోపలికి వచ్చి డ్రెస్ అయినా విప్పడానికి శక్తి లేక మంచంమీద పడుకున్నాను. నిద్రరాని నాకు జానకిమీద ఎన్నో అనుమానాలు వచ్చాయి! కాని నా గురించి రాత్రి రాత్రిగా ఉండిపోదు! తెల్లారింది! బాగా పొద్దెక్కింతర్వాత తెలివి వచ్చింది!

కాలకృత్యాలు తీర్చుకుని మళ్ళీ అడయార్ బయలుదేరాను! ఈ సమస్యని పరిష్కరించాలని! ఆ ఇంటి బయట కారు ఆపి లోపలకు అడుగుపెట్టాను, జానకి! పోర్టికోలో నిలబడి

(తరువాయి 23వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

నన్ను చూడలేదు! పోర్టికోమెట్లమీద నిలబడి ఉన్నతన్ని అడుగుతున్నాది 'అయ్యగారు ఇవాళ ఏం అంత వేగం వెళ్ళిపోయారు నాగరాజూ!' అని అతను 'ఈవాళ ఎనిమిదిగంటలకే కాల్‌షీటమ్మా రాత్రికి గాస రారట మధ్యాహ్నం కేరేజిపంపించమన్నారు! ఆయన అయ్యగారు—ఈవిడ అమ్మగారు! నన్ను చూసింది జానకి! బిత్తరపోయింది? అపులేక పోయాను ఆవేశం!

'పేరు మార్చుకున్నంత సులభంగా నిన్ను నువ్వు మార్చుకోలేవు జానకీ! నాకోసం నిరీక్షిస్తానని బాసచేసి ఇల్లు విడిచిన ఆనాడే 'ఈ లోకం నిన్ను నాకోసం నాదానిగా ఉంచగలుగుతుందా' అని నేను పడిన అనుమానం నిజమని ఋజువుచేసావు! వస్తాను జానకీ! పేరు మారినా మనిషి మారినా సుఖంగా ఉన్నావు! నేనా? నీ అంత సులభంగా మరచిపోలేక పోయినా నిన్ను చూసయినా మరచిపోవటం నేర్చుకుంటాను అనేసి గబ-గబ వచ్చేసాను. జానకి నా వెంట 'రామం రామం' అని వస్తున్నా వినిపించుకోలేదు. నేను కారు దగ్గిరకు వచ్చే సరికి సావిత్రి ఉంది! నన్ను చూసి 'ఎక్కడ తిరుగుతున్నారు నిన్న రాత్రినుంచీ' అంది! ఆశ్చర్యపోయాను. నువ్విక్కడికెలా వచ్చావు సావిత్రీ అన్నాను. ఇక్కడ మా ఫ్రెండు ఒకామె ఉంటే వచ్చాను టాక్సీలో! తిరిగి వెళ్తుంటే మన కారు కనిపించింది టాక్సీ దిగి పోయాను!' అంది 'పద కారు ఎక్కు' అన్నాను. జానకి గేటు దగ్గిర నిలబడి ఉంది! చూడలేదు! స్టీరింగ్ ముందు కూర్చుని స్టార్టు చేసాను. కదిలింది! 'అవిడెవరు ఎందుకు అక్కడ కారు ఆపారు?' అడిగింది సావిత్రి! ఏం చెప్పాలి? 'బోనెట్ ఓవర్‌హీట్ అయితే ఆపి నీళ్ళు అడిగాను ఇచ్చిందామె' అబద్ధమాడాను ఎప్పుడూ నిజం చెప్పేవాళ్ళు ఒకసారి అబద్ధమాడినా అది నిజమే అవుతుంది వినేవాళ్ళ విశ్వాసంలో! మా యింటిదగ్గిర కారు ఆపి దిగాను. 'సావిత్రి కారు తీసుకుని ఇంటికి వెళ్ళిపో' అన్నాను. 'మీరు రారా?' అంది. 'ఇప్పుడు రాలేను నాన్నగారితో చెప్పు' అని లోపలికి వచ్చాను. ఎంతసేపు ఏడ్చానో తెలియదు! నిద్రపట్టింది! బాగా బాధతో బరువెక్కిన హృదయం నిద్రే కోరుకుంటుంది. సాయలకాలం 6 గంటలకి తెలివి వచ్చింది! కాని కదలకపోయాను, మళ్ళీ పడుకున్నాను. ఆ నాస్థితి ఆ మర్నాడు సాయంకాలం దాకా అలానే ఉంది! ఆ పరిస్థితి అలాంటిది!

సావిత్రి వచ్చింది! పడుకున్న నన్ను చూసి 'ఏం అలా ఉన్నారు?' అంది! ఏం లేదు కాస్త తలనొప్పి అన్నాను. 'నిన్న మధ్యాహ్నం జేమ్సు వచ్చారు మీరు వస్తారేమోనని ఎదురు చూసారు ఇప్పుడే సెంట్రల్‌కి వెళ్ళేరు. ఎనిమిది గంటలకు ట్రెయిన్‌లో డ్యూటీ చెయ్యాలిట. మిమ్మల్ని రమ్మనమని చెప్పమన్నారు' అంది. జేమ్సు వచ్చారా! అరె నిన్ననే వచ్చారా కబురంపిస్తే వచ్చే వాడినిగా అని లేచి డ్రెస్ చేసుకుని క్రిందికి దిగి కారులో కూర్చున్నాను. సావిత్రి కారెక్కలేదు! ఏం సావిత్రి నువ్వు రావా? అన్నాను. 'ఊహూ రాను మా ఫ్రెండు ఇంటికి వెళ్ళి అక్కడనుంచి వెళ్ళిపోతాను అంది. 'మరి కారు' అన్నాను. 'వాళ్ళకారులో వెళతాను లెండి' అంది. సరే అని బయలుదేరాను. కొద్ది నిముషాల్లో సెంట్రల్‌స్టేషను చేరింది కారు!

(సశేషం)

# అంకితం

రచన :
శ్రీ, అలమూరు సూర్య వెంకటరమణరావు

(గతసంచిక తరువాయి)

డ్రాయింగ్ రూముకి వెళ్ళాను. జేమ్సు కూర్చుని ఉన్నారు. నన్ను చూడగానే 'రా అబ్బాయి నిన్న ఇవాళ ఆఫీసుకి రాలేదు ఎక్కడకు వెళ్ళావు? కులాసాగా ఉన్నావా' అన్నారు. 'ఏం లేదు కొంచెంతల భారంగా ఉంటే రాలేక పోయాను' అన్నాను. 'పోనీ ఇప్పుడు తగ్గింది కదా?' అన్నారు. 'ఊ' అనగలిగాను! 'నేను నిన్ననే వచ్చానబ్బాయి. ఓ వ్యవహారం వెంకటాచలం గారితో మాట్లాడాలని, నీతోనూ మాట్లాడాలని' అన్నారు. 'నాతోనా?' అన్నాను. 'అవునబ్బాయి కొద్ది రోజులక్రితం వెంకటాచలం నాకు ఉత్తరం రాసాడు. అందులో 'బుద్ధిమంతుడూ, యోగ్యుడువూ సాటివాడివి అయిన నీకు వాళ్ళ మ్మాయినియ్యాలని ఉద్దేశపడుతున్నాడని. ఈ విషయం చిన్నవాడివయిన నీతో సంప్ర దించడం పెద్ద తరహా కాదని, మీ పెద్ద వాళ్ళతో అట్టే పరిచయం లేదని అందుకు నన్ను మీ వారితోనూ, నీతోనూ సంప్రదించి సానుకూలం చెయ్యమని' వ్రాసాడు అని ఆపారు జేమ్సు! ఆశ్చర్యపోయాను. వెంకటా చలం అంత ధనవంతులు నన్ను అల్లుడిగా కోరుకుంటున్నారంటే! కాదు మరి! మళ్ళీ జేమ్సు మొదలు పెట్టారు. 'ఆ ఉత్తరం అందిన వెంటనే నేను చిన్నవాడివయిన నీతో సంప్ర దిస్తే పెద్ద వాళ్ళ ఇష్టం అంటావని ఏలూ రులో మీ ఇంటికి వెళ్ళి మీ వాళ్ళకు విశ రించి చెప్పాను. వెంకటాచలంగారు వ్రాసిన జాతకవిషయాలు చూపించాను. అన్నిటికీ అభి నందించిన మీవాళ్లు ఆ బాధ్యత వాళ్ళ నోటితో చెప్పటం భావ్యం కాదు కనుక 'మావాడి ఇష్టం' అన్నారు. నేనేది కోరినా అడ్డు చెప్పని నా ఆప్తమిత్రుడు వెంకటాచలం నన్ను కోరిన ఈ ఒక్క కోరికనూ సానుకూ లం చెయ్యాలన్న నా తలంపు అక్కడివరకూ నిర్విఘ్నంగా నెరవేరిందన్న విషయం వెంకటా చలంకి చెపుదామని నీమాటకు నాది పూచీ అని వచ్చి చెప్పాను. ఈ విషయంలో నీ నిర్ణ యం విరుద్ధంగా ఉండదని ఆశిస్తూ అడుగు తున్నాను' అన్నారు.

చేసుకుంటే జానకినే పెళ్ళి చేసుకోవాలనే నా నిర్ణయం నిన్న ఉదయంతో నాశన మయింది! జానకి కాక లేని నేను ఎవరి వాడినీ కాకూడదనుకున్నాను. కాని తండ్రిలాంటి జేమ్సు నాకు చేసిన సహాయానికి కృతజ్ఞత చూపించాల్సిన అవసరం వచ్చినపుడు ఆ నిర్ణ యం త్యాగం చెయ్యాల్సిన పరిస్థితిలో ఉన్న నన్ను మరొకసారి జేమ్సు 'నీకిష్టం లేకపోతే చెప్పు బాబూ' అని అడిగినపుడు 'ఇష్టం లేక ఏమండీ అలాగే' అనగలిగాను! 'థేంక్ గాడ్ ఒక వారం రోజుల్లో నీ పెళ్ళి జరగబోతుంది. 'విష్ యు హేవ్ ఏ స్వీట్ లైఫ్' అన్నారు. ఆశ్చర్యపోయాను! 'వారం రోజుల్లోనా' అన్నాను. 'అవును బాబూ ఈ వారంరోజుల్లో

చెయ్యకపోతే ఏదో ఆపాధమాసం వస్తుందన్నారు. ఎనీ హౌ ఎప్పుడయినా జరగాల్సిందేగా!' అన్నారు. కాస్సేపు నిశ్శబ్దం! సంతోషంతో ఇంతవరకూ మాట్లాడిన జేమ్సు కన్నుల్లో నీళ్ళు! ఏవిటది? అన్నాను 'ఈరోజు ఒక కన్ను నవ్వింది. మరొక కన్ను ఏడ్చింది! అన్నారు. మరల 'ఏమిటది' అన్నాను. ఆయన చెప్తున్నారు బాధతో!-

'అయిదేళ్ళక్రితం నువ్వొలా రైల్లో కలిసావో అదేవిధంగా అంతకు పదినెలల ముందు ఒకామె తెనాలి స్టేషనులో తారస పడింది! ఆమె చేసిన పని మహత్తర సాహసం! ఏవిటో తెలుసా? అది ఆమె ఒక సామాన్యకుటుంబంలో జన్మించింది. అదే కుటుంబంలో మరొక శాఖవాడిని ప్రేమించింది. ఆమె ప్రేమించిన తను తనను పెళ్ళి చేసుకుని సంఘంలో నిలబడటానికి తగిన ఆధారాలు లేకపోయినా, వాటికోసం అతను కృషి చేస్తున్న సమయంలో, ఆమె తల్లితండ్రులు మరొకనికి వివాహం నిశ్చయిస్తే ప్రేమించినతనికి ధైర్యం చెప్తూ అతనికోసమే నిరీక్షిస్తానని బాస చేసి అతను సంఘంలో స్వతహాగా తనకు తాను నిలబడగలిగే సమయం వచ్చేవరకూ అక్కడే వేచియుంటే ఆమె తలితండ్రులు చేసే మనసులేని మనువుకు బలి అవాల్సి వస్తుందని, ప్రేమించినతనికి తెలిపి ఈ విశాల ప్రపంచంలో అంతవరకూ తల దాల్చుకోవాలని చెప్పింది. ఆత్మ విశ్వాసం చూసి ఆశ్చర్యపోయాను! అలాటి వారికి ఏ సహాయం చెయ్యాలన్నా ఆత్రపడుతుంది నా హృదయం! ఆమెకు ఫరవాలేదని చెప్పి బెంగుళూరులో నా సహాయంపొందివృద్ధిలోనికివచ్చిన ఒక సినీదర్శకుని దగ్గిరకు పంపించాను. అతన్ని చిన్నప్పటినుంచి ముద్దు-మురిపాలలో తేలించిన అతని చెల్లెలు, వయసులో వివాహం కాకుండా చనిపోయింది. ఆ బాధవల్ల అతను 'తన్నెవరయినా అన్నయ్యా' అని పిలిస్తే పొంగిపోతాడు. అటువంటి వ్యక్తిత్వం కలిగిన అతని దగ్గిర ఆమె స్వంత అన్నయ్యకన్న ఎక్కువగా అభిమానిస్తూంది! కొద్ది రోజుల క్రితమే అతను మద్రాసు వచ్చాడు. ఈరోజు మధ్యాహ్నం అతన్ని చూద్దామని వెళ్ళాను. నన్ను చూసిన అతను కావిలించుకుని ఏడుస్తూ 'మీరు దాచమని ఇచ్చిన అమూల్యమైన ఆమె, తను ఏ ఆశమీద బ్రతుకుతున్నాదో ఆ ఆశ నేలపాలయిందని తన నిరీక్షణ అందీ అందనిదయిపోయిందని, అందువల్ల తనకి జీవితంతో అవసరం లేదని-పూజ్యులయిన జేమ్సు కనపడితే ఈ ఉత్తరం ఇమ్మని నాకొక ఉత్తరం వ్రాసి వెళ్ళిపోయింది.' నిన్న మధ్యాహ్నం వెళ్ళినామె రాత్రి వచ్చింది. ఏమ్మా ఎక్కడకు వెళ్ళావు అంటే అలా బీచ్ కని చెప్పింది! ఉదయంలేచి చూచేసరికి ఆమెకు బదులు ఈ ఉత్తరాలున్నాయి. అని నాకు ఆమె వ్రాసిన ఉత్తరం ఇచ్చాడు. అది చదవగలిగే పరిస్థితిలోలేని నేను అతన్ని ఓదార్చి స్టేషనుకు వచ్చాను. ఇదీ బాబూ ఆమెకథ! అపారు. నిశ్చేష్టున్నయి పోయాను!'

'ఆమె పేరు?' అన్నాను ఆత్రంగా 'సుజాత!' అన్నారు! 'కాదు జానకి!' జేమ్సుగారూ

'ఆమె మీకు వ్రాసిన ఉత్తర మేది?' అన్నాను. 'అవును బాబూ చదువు ఆమె ఏం రాసిందో!' అని ఉత్తరమిచ్చారు. ఆత్రుతగా విప్పాను. ఆ దస్తూరీ! జానకిదే! ఇంకెవరూ అంత అందంగా వ్రాయలేరు.

పితృసమానులయిన జేమ్సుగారికి,

తుదిసారిగా నమస్కరిస్తూ

వ్రాయునది-

వత్తి, ప్రమిద, నూనె వేరుగా ఉన్న పరిస్థితుల్లో వాటిని దరిచేర్చి ఒకదీపాన్ని వెలిగించాలని ఆశపడి, వెలిగించబోయే దీపం గాలికి ఆరిపోకూడదని దానికి గూడు కట్టి ఆశ్రయమిచ్చారు! కాని ప్రయత్నం అయితే మనం చెయ్యగలం దానిని ఫలింప చేసుకునే శక్తి మనమీద లేదు! మీరు వెలిగించాలనుకున్న దీపం వెలగాల్సిన అవసరం లేకుండానే పోయింది! వెలిగించుకోడానికి ఉపయోగించని వత్తి అవసరం ఎవరికీ ఉండదు! అలాగే అయింది. నా జీవితం. వాస్తవానికి నా పేరు సుజాత కాదు! జానకి!

ఈ పొరపాటుకు నిర్మలమయిన మీ జీవితంలో అనవసరంగా ప్రవేశించి ఆవేదన కలిగినందుకు మన్నించమని ప్రార్థిస్తూ మీనుంచి నా నుంచి ఈ ప్రపంచాన్నుంచీ దూరమవాలనుకునే మీ 'జానకి!'

జానకి! నోటమాట రాలేదు! అమ్మా ఆ నాడు నిన్ను ఆదుకోలేకపోయినా నీ జీవితం బాగుపడేదేమోనమ్మా! ఈ దురదృష్టవంతుడి ప్రయత్నం వల్లనే నీ బ్రతుకు కన్నీటి పాలయింది! భగవాన్. మానవులు బాగుపరచలేని ఆమె జీవితాన్ని నువ్వయినా రక్షించు!' అన్నారు జేమ్సు బాధగా.

ఠంగుమని గంట కొట్టింది. ఎనిమిదిన్నర అయింది! 'జేమ్సు' లేచి వస్తాను బాబూ, బాధపడకు! ఒక్కొక్కరి పాత్రలని అంత బాధగా సృష్టిస్తాడు భగవంతుడు! మళ్ళీ నీ పెళ్ళికి కలుస్తాను!' అని వెళ్ళిపోయారు. నేను నిర్జీవంగా లేచి కార్లో ఇంటికి చేరాను. 'జానకీ!' ఏవిటిది జానకీ! నన్నెందుకిలా ఒంటరివాడిని చేసావు! భగవాన్ తప్పు చేసింది నేనయితే నువ్వు విధించే శిక్ష ఆమెకా! విలపించాను, ప్రార్థించాను. అలాటప్పుడు భగవంతుడు మరీ బిగుసుకుపోతాడు! జానకి గురించి మద్రాసు అంతా గాలించాను. కనపడలేదు!

కాలం కష్టాల్ని చూసి ఆగదు! సుఖాన్ని కోరి ముందుకూపోదు. దాని గమనమే అంత వారం రోజులు తిరిగిపోయాయి! అనుకున్నంత సేపయినా అవకుండా వివాహం జరిగిపోయింది! ఆ రోజు సాయంకాలం పందిట్లో కూర్చున్నాను. శూన్యంలోకి చూస్తూ! తమ్ముడు రవి వచ్చి 'అన్నయ్యా నీకు ఉత్తరం' అని ఓ కవరిచ్చాడు. దస్తూరీ చూసాను. జానకి వ్రాసింది! జానకీ! దురదృష్టవంతుడిని చేసావు! కవరు విప్పాను.

పూజ్యులయిన రామంగారికి—

నమస్కరిస్తూ,

నిర్మలమయిన నదిలా ప్రవహించే

నదిలో అకస్మాత్తుగా పడి,

అలజడి కలిగించిన రాయి

మాదిరి మీ జీవిత ప్రవాహంలో
కలత కలిగించిన అభాగ్యురాలు
జానకి వ్రాయునది-

ఒక్కొక్కరి జీవితాలు అవి ఎటూ సుఖపడకపోగా, ఎదుటివారి జీవితాలకి బాధలు కలిగిస్తూంటాయి. అలాటి దురదృష్టవంతురాలిని నేను! ఆ రోజు నా సోదరసమానుడయిన రాజశేఖరం గారింటికి మీరు వచ్చి నన్ను అపార్థం చేసుకుని వెళ్ళిన తర్వాత మీ వివరం కనుక్కొని మీ మామగారయిన శ్రీ వెంకటాచలం గారింటికి వచ్చాను. ఆ క్షణంలో అక్కడ నన్ను ఆ రోజు ఇల్లు విడిచి వస్తున్న పరిస్థితుల్లో ఆదుకున్న 'జేమ్సుగారు' కనపడ్డారు. వారి మాటలు విన్న నేను జేమ్సుగారికి మీరు బాగా తెలుసునని, వారు మీ వివాహ విషయం సానుకూల పరిచే బాధ్యత తనమీద వేసుకున్నారని, ఈ వివాహానికి మీ తలితండ్రులు ఎక్కువగా ఆమోదిస్తున్నారని తెలుసుకున్నాను అంతటి ఆనందంలో నాలాటి అభాగ్యురాలి ఘోష వినిపించడానికి నా మనసు ఒప్పలేదు! ప్రేమ కోసం త్యాగం చెయ్యలేని వాళ్ళు ప్రేమించడానికే అనర్హులు. మీ జీవితం సరియైన మలుపులో తిరిగింది! ఇంక నాకు కావలసిందేమీ లేదు! మీ మంచి మనసులో జన్మ జన్మలకీ జ్ఞాపకంగా నిలచిపోతే అంతే చాలు! అంతకన్నా అదృష్టం మరొకటి లేదు! అదృష్టం ఎదురుగుండా ఉన్నా, అనుభవించలేని అభాగ్యురాలిని!

జన్మ జన్మలకీ మీరే భర్త కావాలని కోరుకునే భార్య ఉంది మీకు! ఏ జన్మలోనయినా భార్య కావాలనే కోరిక ఉంది నాకు! ఆమె కోరిక తీరింతర్వాతే నాకు ప్రాప్తముంటే కలిగించమని భగవంతుని ప్రార్థిస్తూ ఈ జన్మకి ఆఖరు సారిగా.

మీ పాదాలకు నమస్కరిస్తూ ఇంకిపోయిన కన్నీటిలో ఎండిపోయిన అభాగిని
జానకి!

జానకీ! ఎవరు దురదృష్టవంతులు జానకీ! కోరుండీ దూరం చేసుకున్న అభాగ్యుడికి, దూరంగా భగవంతునికి దగ్గిరగా చేరాలనుకున్నవా? జరిగిన అవాంతరానికి ఆవేదనతో చేసిన పాపానికి చింతిస్తూ భగవంతుడిచ్చిన గడువు వచ్చేవరకూ భారంగా బ్రతుకు గడిపే నేనా? పిచ్చిదానివి జానకీ! నేనే దురదృష్టవంతుని!

ఒక్కసారిగా గాలి వీచింది! చేతిలో ఉన్న ఆ ఉత్తరం ఎగిరి ఎగిరి ఆ రోజు క్రితంరోజు వివాహానికి ఏర్పరచిన అగ్నిహోత్రంలో పడిన ఆ ఉత్తరాన్ని అందులో ఆరిపోబోతున్న నిప్పు ఒక్కసారి ఆ ఉత్తరాన్ని గుప్పుమని మండించింది!

కాలిపోతున్నా చూస్తూ కూర్చున్నాను. అప్పుడే వచ్చిన సావిత్రి 'అదేవిటండీ ఆ కాగితం! అలా కాగితం కాలిపోతుంటే చూస్తూ కూర్చున్నారు' అంది! అంతకన్నా ఏం చెయ్యలేను కనుక అన్నాను. అదేవిటి? అంతే, సావిత్రీ. అంతకన్న చెప్పడానికి నాకు-తెలుసుకోవడానికి నాకు. నీకూ అందులో

(తరువాయి 19వ పేజీలో)

ఇంకేం లేదు!' ఆః నేనో కోరిక కోర తాను మన్నిస్తావా అన్నాను. 'అదేవిటండీ మీరు కోరటమేమిటి నేను మన్నించడమేమిటి! మీరు ఆజ్ఞాపించండి నేను శిరసా వహిస్తాను అంది!' నిన్ను ఇకమీదనుంచీ 'జానకీ' అని పిలవాలని ఉంది అన్నాను. 'ఇంతేనా నేను మీదాన్ని. మీ ఇష్టం వచ్చినట్లు పిలవండీ' అంది. 'చాలు-ఆమాత్రం చాలు జానకీ!' అన్నాను. 'ఉండండి లైటు వేసి వస్తాను.' అంది. ఆ జానకి మూసిన చీకటిని ఈజానకి వెలిగించగలదా? ఈ వెలుగులో అది మాయమవటానికి ఈజన్మ సరిపోతుందా! చాలదు. ఎన్ని జన్మలయినా చాలదేమో! ఈ జన్మలో తీరని ఆశలూ-ఆశయాలూ మరొక జన్మలో తీర్చమని భగవంతుని అర్థించటం అపరాధమేనేమో! అయినా మన తృప్తి అది! ఆ తృప్తి మనసులో పెంచుకోపోతే మనం మనంగా బ్రతకలేదేమేమో

(సమాప్తం)

